ప్రజా విశ్వంభర
V3 NEWS

# ప్రభుత్వ భూముల లెక్క తేల్చాలి.. స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలి..

విశ్వంభర, ఏపీ బ్యూరో: భూమి కొరతతో అభివృద్ధి ఆగకుండా రాష్ట్రంలోని నిరుపయోగ ప్రభుత్వ భూములన్నింటి లెక్క తేల్చి స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రాజెక్టు మంజూరయ్యాక భూమి కోసం వెతకుండా ముందుగానే ల్యాండ్?ను గుర్తించి సిద్ధంగా ఉంచేలా వ్యవస్థను మార్చాలని స్పష్టం చేశారు. ఎస్సీలకు అందుతున్న ప్రయోజనాలను బుడగ జంగాలకు కూడా వర్తింపజేసేలా తక్షణ ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.ప్రతి శాఖ, ప్రతి జిల్లాకు మూడు నెలల యాక్షన్ క్యాలెండర్ రూపొందించి గడువులోగా ఫలితాలు సాధించాలని చంద్రబాబు పేర్కొన్నారు. యాక్షన్ టేకెన్ రిపోర్ట్?పై సమీక్షలో బుడగ జంగాలకు ఎస్సీల ప్రయోజనాలు, నైపుణ్యాభివృద్ధి, గృహాల నిర్మాణం, తాగునీటి అత్యవసర పనులు, 50 శాతం హరిత ప్రాంతం లక్ష్యంగా మొక్కల పెంపకం సహా పలు అంశాలను వేగంగా అమలు చేయాలని సీఎం తేల్చి చెప్పారు. ఇప్పటికే మంజూరైన గృహాలను వేగంగా పూర్తి చేయడంతో పాటు అదనంగా రానున్న లక్షన్నర ఇళ్లను దశలవారీగా అమలు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి అత్యవసర పనులకు వేగం పెంచాలని చంద్రబాబు ఆదేశించారు. 50 శాతం హరిత ప్రాంతం లక్ష్యంగా 20 కోట్ల విత్తనాలు, మొక్కలను ప్లాంటేషన్ సీజన్‌కు ముందే సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. తక్కువ నీటితో పెరిగే మొక్కలు, నీటి సంరక్షణ పనులు, ప్రీ-మాన్‌సూన్ డ్రై సోయింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నిర్ణయాలకు ఇక గడువు పొడిగింపులు ఉండవని, యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లో కనిపించే ప్రతి పెండింగ్ అంశానికి వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఇంకుడు గుంతల ప్రభావం ఇప్పుడిప్పుడే ఫలితాలు ఇస్తున్నాయని చంద్రబాబు అన్నారు. 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయాలని అనుకున్నామని చెప్పారు. అందుకు నిర్దిష్ట లక్ష్యాలు ఇచ్చామని




బాధ్యతగా పని చేయాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. టెలీ కమ్యూనికేషన్‌లో నూతన సాంకేతికత వచ్చిందన్న సీఎం అమెరికా కంటే అత్యుత్తమ టెక్నాలజీ మనం వాడుతున్నామని పేర్కొన్నారు. రోడ్ గ్రిడ్‌లో ప్రపంచంలోని అతిపెద్ద దేశాల్లో రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. రోడ్ గ్రిడ్‌తో పాటు పోర్టులు, ఎయిర్‌పోర్టులు వస్తున్నాయని వివరించారు. నదుల అనుసంధానంతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే ఏ సమస్యా ఉండదని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# టెక్నాలజీతో టాలెంట్‌కు పదును.. కేబీఎన్ కళాశాల విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు..

విశ్వంభర, ఏపీ బ్యూరో: ఉద్యోగాల కోసం ఎదురు చూసే రోజులు పోయాయి. నేటి యువత తమ స్కిల్స్‌తో సరికొత్త అవకాశాలు సృష్టించుకుంటున్నారు. ఇదే తరహాలో ముందడుగు వేస్తున్నారు ఆ విద్యార్థులు. చదువుకుంటూనే తమలోని నైపుణ్యాలకు సాంకేతికతను జోడించి ఆవిష్కరణలు చేస్తున్నారు. సంగీత అభ్యాసానికి యాప్ రూపొందించడం,వాయిస్ కమాండ్‌తో వీడియో ఎడిటింగ్ చేయడం వంటి వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. చదువు, ఉపాధి అవకాశాలు ఒకేచోట పొందుతూ భవిష్యత్‌కు బలమైన పునాది వేసుకుంటున్న విజయవాడకు చెందిన విద్యార్థులపై కథనం.

చదువంటే పుస్తకాలు, పరీక్షలే కాదు. కొత్తగా ఆలోచించడం ఆ ఆలోచనలకు ఆచరణ రూపం ఇవ్వడమూ అందులో భాగమే. ఇలాంటి ఆలోచనలతోనే ముందుకు సాగుతున్నారు విజయవాడకు చెందిన కేబీఎన్? కళాశాల విద్యార్థులు. తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలను ప్రయోగాత్మకంగా అమలు చేస్తూ రియల్ టైమ్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపిస్తున్నారు. ప్రాజెక్టులను ప్రదర్శనకే పరిమితం చేయకుండా వాటిని భవిష్యత్‌లో ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తున్నారు.ఒకప్పుడు సంగీతం, నృత్యం నేర్చుకోవాలంటే ప్రత్యేకంగా గురువు దగ్గరకు వెళ్లి శిక్షణ తీసుకునేవారు. కాలం మారింది. అందుకు తగ్గట్టుగానే టెక్నాలజీతో సంగీత అభ్యాసాన్ని సులభతరం చేసే ప్రయత్నం చేశారీ విద్యార్థినులు. నాద బ్రహ్మ ఏఐ పేరుతో సరికొత్త ప్రాజెక్టు రూపొందించారు. ఈ యాప్ ద్వారా రాగం, తాళం, గమకం, కృతులను సులభంగా నేర్చుకునేలా తయారు చేశారు. ప్రస్తుతం కంటెంట్ క్రియేటర్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. విద్యార్థులు సైతం ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఎడిటింగ్‌పై ఆసక్తి ఉన్నా చదువు, అభిరుచి రెండింటికీ సమప్రాధాన్యం ఇచ్చేందుకు సమయం లభించక వెనకడుగు వేస్తున్నారు. దీనికి పరిష్కారంగా ఎడిటింగ్ త్రూ వాయిస్ కమాండ్స్ అనే వెబ్‌సైట్ రూపొందించారు. ఎడిటింగ్ కోసం ప్రతిసారీ మౌస్, కీబోర్డ్ వాడాల్సిన పని లేకుండా వాయిస్ కమాండ్‌తో వీడియో ఎడిటింగ్ చేయొచ్చని చెబుతున్నారు. ఓవైపు చదువుకుంటూనే తనలోని నైపుణ్యాన్ని ఉపాధి అవకాశంగా మలచుకుంటున్నాడీ యువకుడు. మధ్యాహ్నం కాలేజీ అవ్వగానే క్యాంపస్‌లోనే తోటి విద్యార్థులకు మొబైల్ రిపేర్ సేవలు అందిస్తున్నాడు. మొబైల్‌లో ఏ సమస్య వచ్చినా బయటి షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా క్యాంపస్‌లోనే సరి చేసి ఇస్తున్నాడు. విద్యార్థి దశలోనే ఖాళీ సమయాన్ని తన నైపుణ్యానికి కేటాయిస్తూ ఉపాధి అవకాశం కల్పించుకుంటున్నాడు.మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించాలనే ఆలోచనతో షీ



ప్రెన్యూర్ అనే ఏఐ ఆధారిత యాప్ డిజైన్ చేశారు మరో విద్యార్థుల బృందం. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వ్యాపారం చేయాలని ఆలోచించే మహిళల వృద్ధికి తోడ్పడేలా దీన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్‌లో ఈ యాప్‌ను మరింత అభివృద్ధి చేసి ఎక్కువ మంది అతివలకు చేరువ చేయాలన్నదే లక్ష్యం అంటున్నారు. విద్యార్థుల ఆలోచనలకు ఆచరణ రూపం దాల్చాలంటే సరైన మార్గదర్శకత్వం ఎంతో అవసరం. అలాంటి మార్గనిర్దేశమే చేస్తున్నారు కేబీఎన్ కళాశాల యాజమాన్యం. విద్యార్థుల్లోని ప్రతిభ తొలి దశలోనే గుర్తించి, వారికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక మద్దతును అందిస్తున్నామని చెబుతున్నారు. సృజనాత్మకతకు సరైన మార్గదర్శకత్వం తోడైతే విద్యార్థులు అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపిస్తున్నారీ విద్యార్థులు.చదువు కేవలం ఉద్యోగం కోసమే కాదు సరికొత్త అవకాశాలను సృష్టించడం కోసం! ఈ మాటను అక్షరాలా నిజం చేస్తున్నారు ఆ విద్యార్థులు. డిగ్రీ పట్టాలకోసం పుస్తకాలకే పరిమితం కాకుండా, తమలోని సృజనాత్మకతకు పదును పెడుతూ సరికొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నారు. చదువుకుంటూనే తమ నైపుణ్యంతో క్యాంపస్‌లోనే స్వయం ఉపాధి అవకాశాలు వెతుక్కుంటున్నారు.

# “ఆధారాలతో అన్నీ నిరూపిస్తా”.. మెగా డీఎస్సీపై మరోసారి జగన్ సంచలనం

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** మెగా డీఎస్సీపై రాష్ట్ర ప్రభుత్వం తన తప్పుల్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని వైఎస్సార్సీపీ అధినేత జగన్ ఆరోపించారు. మెగా డీఎస్సీ నియామకాల్లో అనేక అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. మెగా డీఎస్సీపై అసెంబ్లీ వేదికగా చంద్రబాబు, లోకేష్ అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు.“ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ ఒక్కరికే ఎందుకు? రాజజు=ు విభాగంలో పనిచేసే నవీన్ కి ఫస్ట్ ర్యాంక్ ఎలా? ఫస్ట్ ర్యాంక్ వచ్చిన నవీన్ కి ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదు? స్పోర్ట్స్ కోటా జీవోను మార్చేసి 372 పోస్టుల భర్తీ ఎందుకు?” అని వరుస ప్రశ్నలు సంధించారు. పరీక్షలు పెట్టకుండానే 372 మందికి ఉద్యోగాలు కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. జీవో నంబర్ 4, జీవో నెంబర్ 47ను ఎందుకు తీసుకొచ్చారని నిలదీశారు. నకిలీ సర్టిఫికెట్లతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలిచ్చారని, జూడో అనే ఆట కింద 39 మందికి పోస్టులు ఇచ్చారని ఆరోపించారు. పోటీలు జరగకున్నా జరిగినట్లుగా సర్టిఫికెట్లు సృష్టించారు. డీఎస్సీ అక్రమాలపై తాము వేస్తున్న ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సమాధానం చెప్పలేకపోతున్నారని జగన్ విమర్శించారు. అక్రమాలను ప్రశ్నించిన జర్నలిస్టులపై, ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చే ప్రశ్నలను బుల్డోజ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన స్కాముల హిస్టరీలోనే ఈ డీఎస్సీ స్కామ్ ఒక ఆణిముత్యం లాంటిదని ఎద్దేవా చేశారు. తన కొడుకును కాపాడుకునేందుకే చంద్రబాబు



తాపత్రయపడుతున్నారని, ఆధారాలు చూపిస్తుంటే ఆయనకు బీపీ పెరుగుతోందని జగన్ అన్నారు. మెగా డీఎస్సీ నియామకాలు సక్రమంగానే జరిగితే.. ఫస్ట్ ర్యాంకర్ కోర్టుకు ఎందుకు వెళ్తాడని నిలదీశారు. ఈ స్కామ్‌పై ఆధారాలు నివ్వెరపోయేలా ఉన్నాయని, త్వరలోనే వీటన్నింటినీ ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు.

## కార్యకర్తల సమావేశంలో కంటతడి పెట్టిన మాజీ మంత్రి బొత్స



**విశ్వంభర, గరివిడి:** విజయనగరం జిల్లా గరివిడిలోని వైకాపా కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఆవేదనకు గురైన నాయకులు.. చిన్న శ్రీనుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రసంగాల మధ్యలో భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఒక్కసారిగా కంటతడి పెట్టారు. పార్టీ కోసం కలిసి నడిచిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. స్థానిక ఎన్నికల ముందు ఉత్తరాంధ్రలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైకాపా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆ పార్టీకి రాజీనామా చేసి ఇటీవల టీడీపీలో చేరారు. కొన్నాళ్లుగా బొత్స సత్యనారాయణ, చిన్న శ్రీను మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. పార్టీలో మేనల్లుడి ప్రాధాన్యం తగ్గించేలా బొత్స ప్రయత్ని స్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను వైసీపీని వీడారు. వివిధ నియోజకవర్గా ల్లో చిన్న శ్రీను తనకంటూ సొంత క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గత జడ్పీటీసీ ఎన్నికల్లో 34 మండలాల్లో వైకాపా గెలిచింది. జిల్లాలోని 400కు పైగా ఎంపీటీసీ స్థానాలు, 800కుపైగా పంచాయతీ సర్పంచి పదవులు కూడా ఆ పార్టీ దక్కించుకుంది. స్థానిక ఎన్నికలు జరగనున్న కీలక తరుణంలో ద్వితీయ శ్రేణి నాయకత్వం శ్రీను వైపే మొగ్గుచూపితే వైకాపాకు భారీ నష్టమే.

## విశాఖలో ఘనంగా ప్రారంభమైన 41వ ఐఏటీవో వార్షిక సదస్సు



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** 41వ ఐఏటీవో వార్షిక సదస్సు విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందస్సుకుముఖ్య అతిథిగా కేంద్ర పౌరవిమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. సదస్సుల్లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. దేశానికే ప్రధాన పర్యాటక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవిస్తోందని అన్నారు. ఏపీని విజిట్ చేయండి.. భారతదేశ వైవిధ్యాన్ని అనుభూతి చెందండి అంటూ టూర్ ఆపరేటర్లకు మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. గోదావరి పుష్కరాల కోసం 7 ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ల రూపకల్పన చేసినట్టు తెలిపారు. కుంభమేళా రేంజ్‌లో పుష్కరాల ఘనతను ప్రపంచానికి చాటేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని అన్నారు. పాలసీ నుంచి ప్రమోషన్ వరకు... ఏపీ టూరిజంలో ఆరంచెల విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉంటే ఏపీ ప్రభుత్వం టూరిజంపై ఎక్కువ ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఎన్నో సుందరమైన ప్రదేశాలు ఉండటంతో దానిని ఆదాయంగా మార్చుకోవాలని సర్కార్ భావిస్తోంది.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి



**విశ్వంభర,విజయవాడ:**అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ సంస్కరణలపైమంత్రిఅనగాని సత్యప్రసాద్ కీలక ప్రకటనలు చేశారు. నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు ఇవాళ్టి నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు చోటుచేసుకున్న 4 లక్షల ఎకరాలపై సమగ్ర విచారణ చేపడుతున్నామని, గత ప్రభుత్వం 22-ఏలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే నిషేధిత జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22-ఏ నుంచి భూముల తొలగింపును సులభతరం చేసేందుకు జీవో 444, కొత్తగా భూములను 22-ఏలో చేర్చే విధానాన్ని స్పష్టం చేస్తూ జీవో 445 జారీ చేశామని వివరించారు. భూమి హక్కులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ‘మీ భూమి-బ్లాక్‌చెయిన్’ టెక్నాలజీ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## ఏపీలో భూకంపం... ఇళ్ల నుంచి పరుగులు తీసిన జనం

విశ్వంభర, కర్నూలు: కర్నూలు జిల్లాలో హఠాత్తుగా భూకంపం సంభవించింది. దీంతో ప్రజలను తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కర్నూలుతో పాటు ఆదోని, దాని పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు, పాత్రలు భయంకరమైన శబ్దాలతో కదిలిపోయాయి. ఈ ధాటికి ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇళ్లలో ఉంటే ఏమవుతుందోనన్న భయంతో చిన్నపిల్లలు, వృద్ధులతో సహా వీధుల్లోకి, ఖాళీ ప్రదేశాల్లోకి పరుగులు తీశారు. కొద్దిసేపటి వరకు ఏం జరుగుతుందో అర్థం కాక తీవ్ర భయాందోళనల మధ్యే వీధుల్లో కాలం గడిపారు. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.5గా నమోదైనట్లు సంబంధిత భూకంపశాఖ అధికారులు ప్రాథమికంగా ధృవీ కరించారు. భూ అంతర్భాగంలో జరిగిన చిన్నపాటి సర్దుబాట్ల వల్లే ఈ ప్రకంపనలు చోటుచేసుకున్నాయని, తీవ్రత తక్కువగానే ఉండటం వల్ల పెద్దగా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే భూమి స్వల్పంగానే కంపించినప్పటికీ, స్థానికంగా వచ్చిన విచిత్రమైన శబ్దాలు ప్రజల్లో వణుకు పుట్టించాయి. ఆదోని పట్టణంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాల్లో కూడా ఈ ప్రభావం కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక యంత్రాంగం, పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించారు. బాధితుల నుంచి సమాచారం సేకరించారు. ఎక్కడైనా గోడలు కూలడం లేదా ఆస్తి నష్టం జరిగిందా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. భూకంప తీవ్రత తక్కువగానే నమోదైనందున ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## ఎమర్జెన్సీ నా జీవితాన్ని మలుపు తిప్పింది మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**విశ్వంభర, తెనాలి :** దేశంలో విధించిన ఎమర్జెన్సీ తన జీవితాన్ని మలుపు తిప్పిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. ఎమర్జెన్సీ పరిస్థితులు లేకపోతే తాను న్యాయవాదిని అయ్యేవాడినని చెప్పారు. గురువారం గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన భాజపా వరిష్టనేత తమిరిశ రామాచార్యుల శతజయంతి ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గుంటూరు టుబాకోబోర్డు మాజీ ఛైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు.ఎమర్జెన్సీ సమయంలోనే అన్యాయం, అక్రమాలను నిలదీసే తత్వాన్ని అలవర్చుకుని రాజకీయాల వైపు వచ్చినట్లు వెంకయ్యనాయుడు తెలిపారు. ఏబీవీపీ విద్యార్థి సంఘ నేత నుంచి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగినట్లు గుర్తు చేశారు. దివంగత రామాచార్యులు తుదిశ్వాస వరకు ఎలాంటి పదవులు ఆశించకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీ, ఎల్.కె. అద్వానీ వంటి అగ్ర నాయకులందరూ తెనాలిలోని ఆయన నివాసానికి వచ్చేవారన్నారు. ఇది ఆయన నాయకత్వ లక్షణాలకు నిదర్శమన్నారు. తెనాలిలో రైళ్లు ఆగేందుకు కూడా ఆయన కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తమిరిశ అనంతాచార్యులు, యడ్లపాటి స్వరూపరాణి, అగ్నిహోత్రం ఆత్రేయబాబు, జూపూడి రంగరాజు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం



**విశ్వంభర, తిరుమల:** తిరుమల శ్రీవారికి గురువారం రికార్డు స్థాయిలో రూ.6.93 కోట్ల హుండీ కానుకలు లభించాయి. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వచ్చిన హుండీ కానుకలను గురువారం లెక్కించగా ఈ కానుకలు లభించాయి. టీటీడీ చరిత్రలో ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే ఒక్కరోజులో రూ.6 కోట్లకు పైగా హుండీ కానుకలు లభించిన రికార్డు ఉంది. కొందరు అజ్ఞాత భక్తులు భారీగా హుండీ కానుకలు వేయడంతో ప్రస్తుత రికార్డు నమోదైనట్లు సమాచారం.

**ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు..**

మరోవైపు శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే గురువారం ప్రకటించింది. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు వరుస సెలవులు ఉండటంతో రద్దీ మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో 13వ తేదీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు తితిదే ప్రకటించింది. ఆ సమయాన్ని సామాన్య భక్తులకు కేటాయించనున్నారు. దీంతో శనివారం భక్తుల నుంచి ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించరు.

## ఏపీలో మద్యం రవాణా కేసు.. వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డిలకు చుక్కెదురు



ఢిల్లీ: వైసీపీ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసు లో నిందితులుగా ఉన్న ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిలకు సుప్రీంకోర్టు లో చుక్కెదురైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నట్లు ఇరువురి తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రవాణా కుంభకోణం అంటూ కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని నిందితుల తరఫు న్యాయవా దులు కోర్టులో వాదించారు. మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై జైలులో ఉన్నప్పుడు కస్టడీలోకి తీసుకోకుండా.. ఇప్పుడు మళ్లీ కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసి కస్టడీకి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వాదనల అనంతరం.. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ సంబంధిత కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచిస్తూ సుప్రీంకోర్టు రెండు పిటిషన్లను డిస్మిస్ చేసింది.

## భారీ చోరీ.. 46 సవర్ల బంగారం, 2.4 కిలోల వెండి అపహరణ



**విశ్వంభర, చిలకలూరిపేట:** పల్నాడు జిల్లా యడ్లపాడులో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని పార్వతి హైదరాబాద్‌వెళ్లిన సమయంలో దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొంబడినదొంగలు.. 46 సవర్ల బంగారం, 2.4 కిలోల వెండి, రూ.2 లక్షల నగదుఎత్తుకెళ్లారు.సమాచారం అందుకున్న వెంటనే యడ్లపాడు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్ బృందం ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించింది. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో దుండగుల కదలికలు రికార్డైనట్లు గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు.

## తిరుపతి జిల్లాలో ట్రావెల్స్ బస్సు దగ్ధం



**విశ్వంభర, తిరుపతి:** తిరుపతి జిల్లా ఓజిలి మండలంరాజుపాలెం వద్ద గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. బాపట్ల నుంచి బెంగుళూరుకు 19 మందితో వెళ్తున్న బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ సహా ప్రయాణికులు కిందకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది. చూస్తుండగానే అగ్నికీలలు వేగంగా వ్యాపించి బస్సు పూర్తిగా కాలిపోయింది. గూడూరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

## ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



**విశ్వంభర, కంకిపాడు :** కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడ సిటీ ఏఆర్ విభాగానికి చెందిన హెచ్ కానిస్టేబుల్ ఆర్లు రాజేశ్.. 2009 బ్యాచ్ ఉద్యోగి. ప్రస్తుతం ఆయన ఆర్డర్ టు సర్వ్‌పై కృష్ణా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలుస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.